చెత్తకు లెక్కగట్టి.. ఆదాయం రాబట్టి

- మున్సిపాలిటీలో చెత్త పరిమాణం బట్టి పన్ను విధింపు
- వాణిజ్య దుకాణాలకు జియో ట్యాగింగ్, క్యూ ఆర్ కోడ్
- కార్యాచరణను రూపొందిస్తున్న మున్సిపల్ అధికారులు


ఇంటింటికి చెత్త సేకరణ చేస్తున్న ఆటో

మిర్యాలగూడ టౌన్ : స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా మన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను పాటించేందుకు మున్సిపల్ యంత్రాంగం కసరత్తు చేస్తుంది. ఇంటి నుంచి సేకరించే చెత్తతో పాటు దుకాణాల ద్వారా ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలకు ఇకపై పక్కాగా లెక్కలు ఉండే విధంగా చర్యలు చేపడుతున్నారు. చెత్త పరిణామాల ఆధారంగా వాణిజ్య కేంద్రాలను విభాగాలుగా ఏర్పాటు చేయనున్నారు. ప్రాంతాన్ని బట్టి వాణిజ్య కేంద్రాల్లో చెత్త ఉత్పత్తిని లెక్కించి మున్సిపాలిటీకి పన్నుల రూపంలో ఆదనపు ఆదాయాన్ని రాబట్టేందుకు నూతన పద్ధతి మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టనున్నారు.

చెత్త సేకరణకు ప్రత్యేక వ్యవస్థ

మిర్యాలగూడ మున్సిపాలిటీలో నివాస గృహాలకు జియోట్యాగ్ చేసిన విషయం తెలిసిందే. గృహాల మాదిరిగానే ఇక నుంచి వాణిజ్య ప్రాంతాల్లోని చెత్త సేకరణకు ప్రత్యేక వ్యవస్థను చేపట్టాలని అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. దీంతో ప్రధాన రోడ్డు వెంట ఉన్న ప్రతి దుకాణాన్ని గుర్తించి జియో ట్యాగింగ్‌లో పొందుపరిచిన లెక్కల ఆధారంగా దుకాణాసముదాయాలకు క్యూర్ కోడ్‌తో కూడిన నంబర్లు కేటాయించనున్నారు. త్వరలోనే దీనిని మ్యాప్ చేయనున్నారు. ప్రధానంగా ప్రైవేట్ సంస్థలు, దుకాణాలు, ఆస్పత్రులు, మార్కెట్లు, ఆలయాలు, మసీదులు, హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, మాంసం, చికెన్ దుకాణాలకు క్యూఆర్ కోడ్‌ను అమర్చేందుకు మున్సిపల్ అధికారులు ఒక కార్యాచరణను రూపొందిస్తున్నారు. అయితే ఏఏ దుకాణానికి ఎంత చెత్త వస్తుందో లెక్కులు వేసి పన్నులను విధించనున్నట్లు తెలుస్తుంది.

తడి చెత్తతో ఎరువు తయారీ

మున్సిపాలిటీలో ఉత్పత్తి అవుతున్న తడి, పొడితో ఎరువుల తయారీని చేపట్టాలని అధికారులు నిర్ణయించనున్నారు. వర్మికంపోస్ట్ ప్లాంట్‌తో పాటు రైతులకు అవసరమయ్యే ఎరువులను కూడా గతంలో మాదిరిగా తయారు చేసి వారికి నిర్ణిత ధర మేరకు అందించి ఆదాయం రాబట్టెందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇళ్ల ద్వారా ఉత్పత్తి అవుతున్న చెత్తను వెర్వేరు చేసి డబ్బాల ద్వారా సేకరించి కేటాయించిన ఆటోల్లో డంపింగ్ యార్డుకు తరలించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

సిబ్బందికి సహకరించాలి



దుకాణ సముదాయాల వారు స్వచ్ఛత వైపు అడుగులు వేసేందుకు సిబ్బందికి సహకారం అందించాలి. మున్సిపాలిటీలో చెత్త ఉత్పత్తి సేకరణపై నియంత్రణ చాల అవసరం, ఇళ్లల్లో తక్కువ చెత్తను ఉత్పత్తి చేసేలా స్వీయ నియంత్రణను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే చెత్త వాహనాలు దుకాణాల వద్దకు, ఇళ్ల వద్దకు వస్తున్నందున ఆ వాహనాల్లో వేసి పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలి.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

మిర్యాలగూడ అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష


మిర్యాలగూడ పట్టణంలోని వై జంక్షన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు

మిర్యాలగూడ : పట్టణ అభివృద్ధిపై కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి శనివారం సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని అద్దంకి– నార్కట్‌పల్లి రోడ్డు, వై జంక్షన్, తడకమళ్ల క్రాస్‌రోడ్డు, హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ఎన్ఎస్పీ క్యాంప్ గ్రౌండ్, నందిపాడు బైపాస్‌రోడ్డు, మినీ రవీంద్రభారతీలను ఆమె పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ముందుగా పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ వై జంక్షన్, తడకమళ్ల క్రాస్ రోడ్డు వద్ద నిర్మించిన బ్యూటిఫికేషన్ పనులతో వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా వాటిని ఏ మేరకు సరిచేయాలనే అంశాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. మిర్యాలగూడ మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న 88 షాపులపై ఉన్న స్టేను తొలగించేందుకు సంబంధిత ఫైల్స్‌ను తీసుకోని కలెక్టరేట్‌లోఉన్న లీగల్ అడ్వైజరీకి ఇవ్వాలని, వాటిని పరిశీలించి స్టే తొలగింపుకు కృషి చేస్తానన్నారు. కాగా పట్టణంలోని నందిపాడు బైపాస్, చింతపల్లి బైపాస్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిలకుఏడు నెలల క్రితం శంకుస్థాపన నిర్వహించామని దీనికి సంబంధించిన ఫైల్ ఆర్థిక శాఖ వద్ద ఉందని ఇది క్లియర్ అయ్యే విధంగా జిల్లా మంత్రి, ఉన్నతాధికరులతో మాట్లాడుతానని వివరించారు. అదేవిధంగా మున్సిపల్ డంపింగ్‌యార్డు కోసం అనువైన స్థలాన్ని పరిశీలించాలని తహసీల్దార్‌కు సూచించారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు మిర్యాలగూడ మున్సిపాలిటీ నుంచి నలుగురిని మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఇండోర్‌లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ఏ విధంగా చర్యలు తీసుకున్నారో వీరు పరిశీలిస్తారన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, ఎంపీడీఓ శేషగిరిశర్మ, డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం సలహాదారుడికి ఫిజికల్ డైరెక్టర్ల వినతి


వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు

చందంపేట : మోడల్ స్కూళ్లల్లో విధులు నిర్వహిస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ భద్రత లేదని, సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని, జీఓ నంబర్ 254 ప్రకారం తమకు న్యాయం చేయాలని కోరారు. కాగా వేం నరేందర్‌రెడ్డి పీడీల సమస్యలపై సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు శ్రీనునాయక్, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి, రంగారెడ్డి కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : విద్యుత్ తీగలను తాకే చెట్ల కొమ్మలను తొలగింపు కారణంగా ఆదివారం హాలియా పట్టణంలోని 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఉంటుందని ఏఈ ధనరాజ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాలియా సబ్ స్టేషన్ 11కేవీ ఫీడర్ ఫరిధిలో ని లైన్ వెంట ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆ ఫీడర్ పరిధిలో ఇబ్రహీంపేట, పాలెం, చల్మారెడ్డిగూడెం, నాయుడుపాలెం, కొట్టాల, వీర్లగడ్డతండా ప్రాంతాలకు అదే విధంగా అల్వాల సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పంగవానికుంట ఫీడర్ పరిధిలోని లైన్ వెంట ఉన్న చెట్ల కారణంగా పంగవాని కుంట, అల్వాల ఎక్స్‌రోడ్డు, మలిగిరెడ్డిగూడెం, కొత్రివేనిగూడెం, శ్రీరాంపల్లి ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. చ ఉదయం 8.00 గంటల నుంచి 11.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని గృహ, వాణిజ్య, వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నిబంధనలు లేకుండా రుణాలు ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్ : రాజీవ్ యువ వికాసం పథకం కింద బ్యాంకు రుణాలను ఎలాంటి నిబంధనలు లేకుండా ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పాగుల సైదులు గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకానికి ప్రభుత్వం సిబిల్ స్కోరింగ్ సరైంది కాదన్నారు. సిబిల్ స్కోర్‌తో ఎంపిక చేస్తామని ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాటి శివరామకృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుణగంటి వెంకన్న నియోజకవర్గ అధ్యక్షులు సతీష్‌కుమార్, యువజన సంఘం అధ్యక్షులు రామరాజు గోపి తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వర్‌రావు జయంతి


విఘ్నేశ్వర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల విఘ్నేశ్వర్‌రావు (పీవీ రావు) 73వ జయంతిని శనివారం పట్టణంలోని ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పలువురు మాల మహానాడు నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బొప్పని నగేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సామాజిక వేత్త డాక్టర్ జాడీ రాజు, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మాదుగుల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బెజ్జం సాయి, నాయకులు వెంకటరత్నం, నరేష్, కరుణాకర్, గిరి, రవి, ఏడుకొండలు తదితరులున్నారు.

బీజేపీ నిడమనూరు అధ్యక్షురాలిగా శీరిషా



నిడమనూరు : బీజేపీ మండల అధ్యక్షురాలిగా పెందోటి శీరిషాను అధిష్టానం ఎంపిక చేసినట్లు శనివారం విలేకర్లకు శీరిషా తెలిపారు. సాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంకణాల నివేదితారెడ్డి ఆదేశాలతో నిడమనూరు మండలంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని శీరిషా తెలిపారు. శీరిషా ఎంపిక పట్ల బీజేపీ నాయకులు ఉన్నం ఉషాకిరణ్, వినీల్ రెడ్డి, ఇరుగుల శ్రీకాంత్ రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా ఝెదుల్లా వినీల్ రెడ్డిని ఎంపిక చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ప్రకటన విడుదల చేశారు.

శిక్షణ తరగతుల కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా : ఈనెల 24, 25 తేదీల్లో హాలియా పట్టణంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం (టీఆర్‌జీఎస్) విద్యా, వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను శనివారం సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ బంజారాలు మాట్లాడే గోర్ బోలి భాషకు లిపి లేకపోయినా భారతదేశంలో 11 రాష్ట్రాల్లో మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ అసెంబ్లీలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం గోర్‌బోలి భాషను ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్‌నాయక్, హాలియా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రోశేఖర్, టీఆర్‌జీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రమావత్ నరేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నేనావత్ అశోక్ నాయక్, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లాలునాయక్, రమావత్ రమేష్‌నాయక్, తిరుమలగిరి(సాగర్) మండల సహాయ కార్యదర్శి నేనావత్ మునినాయక్, కుర్ర మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

మిర్యాలగూడ : నల్లగొండ జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తెలిపారు. శనివారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 5.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యమని ఇంకా లక్షన్నర టన్నులు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. సుమారు 80శాతం ధాన్యం కొనుగోలు పూర్తయిందని, రైతులకు నగదు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా ఖరీఫ్ సీజన్‌లో ఐకేపీ ధాన్యం కస్టమ్ మిల్లింగ్ 98శాతం పూర్తయిందని, 2శాతం మాత్రమే మిగిలి ఉందన్నారు. సీఎంఆర్ బియ్యం పౌరసరఫరాల శాఖ దిగుమతి చేసుకుందన్నారు.

పిల్లలను ఉన్నతంగా చూడాలన్నదే లక్ష్యం

- అందుకు ఎంత కష్టమైనా భరిస్తా
- భర్త మరణనంతరం రొట్టెలమ్ముతూ జీవనం సాగిస్తున్న విజయ


జొన్న రొట్టెలను చేస్తున్న పానుగోతు విజయ

మిర్యాలగూడ టౌన్ : త్రిపురారం మండలం రాగడప గ్రామానికి చెందిన పానుగోతు విజయ– వంశీలు నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి మిర్యాలగూడ సంతోష్‌నగర్‌లో అద్దె ఇంటిలో నివాసముంటున్నారు. అయితే వీరికి ఇద్దరు కుమారులు పానుగోతు రవికుమార్, పానుగోతు చరణ్‌కుమార్. అయితే రెండేళ్ల క్రితం భర్త వంశీ షుగర్ వ్యాధితో చనిపోయాడు. దీంతో మనోధైర్యంతో ముందుకెళ్లిన విజయ పట్టణంలోని అశోక్‌నగర్‌లో శేఖర్ దుకాణం సమీపంలో జొన్న రొట్టెలను అమ్మి తమ పిల్లలను మంచిగా చదివిస్తుంది. పెద్ద కుమారుడు రవికుమార్ ఎంఎస్సీ ఫిజిక్స్ చేయగా రెండో కుమారుడు చరణ్‌కుమార్ ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కాగా తల్లి కష్టపడుతున్న విషయాన్ని గమనించిన పెద్ద కుమారుడు కొన్ని రోజుల పాటు సూతారి పనులకు కూడా వెళ్లి తల్లికి ఆసరగా నిలిచాడు. అయితే మాతృదినోత్సవం సందర్భంగా విజయ తన మనసులోని మాటను వివరించింది. తన పిల్లల కోసం ఎంతటి కష్టనైనా భరిస్తాను. కానీ తన పిల్లలు మంచి స్థానంలో నిలపాలనేది తన కోరిక. తన భర్త చనిపోయిన తరువాత సాయంత్రం పూట 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు రోట్టెలను చేసి అమ్ముకుంటాను. తనకు వచ్చే డబ్బులతో పాటు తన పిల్లలను బాగానే చదివిస్తున్నాను. నాకు ఎకరం పొలం తప్ప ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. పెద్ద కుమారుడును కలెక్టర్‌గా, చిన్న కుమారుడు డాక్టర్‌గా చూడాలనేది కోరిక అందుకు ఎంతటి భారమైన భరిస్తాను. అయితే ఈ విషయంపై పెద్ద కుమారుడు రవికుమార్, చరణ్‌కుమార్‌లు మాత్రం అమ్మే తమకు గాడ్ ఫాదర్ అంటున్నారు. తమకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకుంటుంది. ఇప్పటి వరకు తమకు మాటత్రం ఎలాంటి లోటు రానివ్వలేదు. అమ్మ లక్ష్యాన్ని నెరవేరుస్తామని పేర్కొన్నారు.

‘సాక్షి’ ఎడిటర్ ఇంటిపై దాడికి నిరసనగా ర్యాలీ


డిండిలో నల్ల బాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

డిండి : సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై ఎలాంటి నోటీసులు లేకుండా ఏపీ పోలీసులు చేసిన దాడిని డిండి మండల జర్నలిస్టులు ఖండించారు. శనివారం మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై కాకుండా అధికారలో ఉన్న ప్రభుత్వాలకు అనుకూలంగా వార్తలు రాయాలని పత్రికల ఎడిటర్లు, విలేకరులపై దాడులు చేయడం సరికాదన్నారు. పత్రికా స్వేచ్ఛను అడ్డుకున్న ప్రతి రాజకీయ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లింగమయ్య, దర్శనం విష్ణు, బి.ఆంజనేయులు, ఆవుట మల్లేష్, మహ్మద్ ఖయ్యూం, బల్మూరి సైదులు, గుద్దేటి సాయికుమార్, పర్వతాలు, ఐలేష్‌చారి,ఎంఏ.ఖాదర్, జహంగీర్ పాల్గొన్నారు.

వైభవంగా కంఠమహేశ్వర స్వామి కల్యాణం


లక్ష్మీపురంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న గ్రామస్తులు

త్రిపురారం : మండలంలోని కామరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిదిలోని లక్ష్మీపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో గౌడ కులస్తులు ఆరాధ్యంగా కొలిచే కంఠ మహేశ్వర స్వామి, సురమాంబ తల్లి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు శనివారం వైభవంగా నిర్వహించారు. నూతన ఆలయంలో వనం ఎల్లమ్మ తల్లి, వనం మైసమ్మ తల్లి, ముత్యాలమ్మ తల్లి, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని దేశగురువు సమక్షంలో నిర్వహించారు. చుట్టు పక్కగ్రామాలైన దుగ్గెపల్లి, జీ అన్నారం, కామరెడ్డి గూడెం, కంపాలపల్లి, కొణతాలపల్లి గ్రామస్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కంఠ మహేశ్వర స్వామి, సురమాంబ తల్లి విగ్రహాలను సాంస్కృతిక నృత్యాలతో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. బంధువులతో గ్రామంలో కోలాహలం నెలకొంది. ఈ కార్యక్రమంలో కనగంటి సైదులు గౌడ్, కనగంటి మారయ్య గౌడ్, పరుశ రాం గౌడ్, జానయ్య గౌడ్, ఏర్ర మల్లయ్య గౌడ్, బుర్బాల అంజయ్య గౌడ్, బొలగానిక అంజయ్య గౌడ్, శంకర్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, కనగంటి రాజు గౌడ్, లక్ష్మీపురం, కామరెడ్డి డెం గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెద్దవూర : మండలంలోని నాయినవానికుంట తండాకు చెందిన రమావత్ సైదా కాడెద్దులు ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగి కిందపడటంతో ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాయి. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన సైదా తనకున్న కొద్దిపాటి వ్యవసాయ పొలంతో పాటు కిరాయిలకు అరకలకు వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. దీంతో వానాకాలం సీజన్ ప్రారంభం కావస్తుండటంతో ఎద్దులు కొనుగోలు చేసే స్థోమత లేక సైదా పడుతున్న ఆర్థిక ఇబ్బందులను తండాకు చెందిన యువకులు గమనించారు. మానవతా దృక్పథంతో చలించి తలాకొంత విరాళాలు ఇచ్చి పోగుచేసిన రూ.10వేల నగదును శనివారం సైదా కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో సైదానాయక్ తనకు సహకరించిన తండాకు చెందిన యువకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉగ్రవాదం, మతోన్మాదాన్ని నిర్మూలించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : ఉగ్రవాదం, మతోన్మాదాన్ని నిర్మూలించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్.. భారత్‌ను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తోందన్నారు. సమస్య జఠిలం కావడానికి పాక్ ప్రభుత్వం, ఉగ్రవాదులే కారణమన్నారు. ఉగ్రవాదం అంతర్జాతీయ సమస్యగా మారిందని దాన్ని అంతం చేసేందుకు ప్రజలంతా ఐక్యంగా పోరాడాలన్నారు. సమావేశంలో డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతంరెడ్డి, రవినాయక్, శశిధర్‌రెడ్డి, రెమిడాల పరుశురాములు, ఎండీ.అంజాద్, తిరుపతి రామ్మూర్తి, పాదూరి గోవర్ధని, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.1.50లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న రమేశ్‌నాయక్

చందంపేట : మండలంలోని తెల్దేవర్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి శనివారం బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వడ్త్య రమేష్‌నాయక్ రూ.1,50,000 శనివారం ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎర్ర జైపాల్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, మహాలక్ష్మయ్య, కిన్నెర హరికృష్ణ, బాలునాయక్, రవి, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ


రంగమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మాడుగులపల్లి : మండలంలోని పోరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పోరెడ్డి వెంకట్‌రెడ్డి మాతృమూర్తి రంగమ్మ శనివారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మిర్యాలగూడ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయవీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు గ్రామానికి చేరుకోని రంగమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, కాంతారెడ్డి, నాయకులు జూలకంటి సైదిరెడ్డి, నరేందర్, జానయ్య, అక్కయ్య, వెంకట్‌రెడ్డి, సైదిరెడ్డి, చింతకాయల సతీష్ పాల్గొన్నారు.

నిడమనూరు : ఇటీవల మృతిచెందిన రహదారులు, భవనాలశాఖ విశ్రాంత ఇంజనీర్ ఏదుళ్ల సత్యనారాయణ రెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి పరామర్శించారు. మండలంలోని రాజన్నగూడెం గ్రామంలోని సత్యనారాయణరెడ్డి తండ్రి నర్సిరెడ్డి, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. విశ్రాంత ఇంజనీర్ సత్యనారాయణరెడ్డి ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించారు. దీంతో వారి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఇంజనీర్ సత్యనారాయణరెడ్డి గ్రామాభివృద్ధిలో తన వంతు సహకారాలు అందించారని నర్సిరెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, కొండా శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ ఝెదుళ్ల పద్మా, వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎడవెల్లి వల్లభారెడ్డి, శివమారయ్య, నందికొండా మట్టారెడ్డి, విజయ్ కుమార్ గౌడ్ ఉన్నారు.

జవాన్ మురళీనాయక్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న నర్సాపురం గ్రామస్తులు

మిర్యాలగూడ : భారత్, పాకిస్తాన్‌కు మధ్య జరుగుతున్న యుద్ధంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సత్యసాయి జిల్లాకు చెందిన మురళీనాయక్ వీరమరణం పొందడంతో దామరచర్ల మండలంలోని నర్సాపురం గ్రామస్తులు శనివారం గ్రామంలో ర్యాలి నిర్వహించి కొవ్వత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ మారుమూల గిరిజనతండాకు చెందిన గిరిజన ముద్దుబిడ్డ మురళీనాయక్ దేశ రక్షణలో భాగంగా అగ్నివీర్‌లో చేరి తన ప్రాణాలను అర్పించారు.

మిర్యాలగూడలో..

పాకిస్తాన్‌తో వీరోచితంగా పోరాడుతూ వీరమరణం పొందిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జవాన్ మురళీనాయక్‌కు సంతాపంగా శనివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌ల పట్టణవాసులు సాగర్‌రోడ్డులోని గాంధీ విగ్రహం నుంచి అమరవీరుల స్థూపం వరకు కొవ్వత్తుల ర్యాలి నిర్వహించి మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మె

నల్లగొండ టౌన్: ఈ నెల 20న నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణలు కోరారు. శనివారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


విజేతలుగా నిలిచిన చిన్నారుల జట్టు

దేవరకొండ : క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని చిన్నపిల్లల వైద్యుడు బాబురాం అన్నారు. శనివారం దేవరకొండలో అలెక్స్ క్రికెట్ అకాడమి ఆధ్వర్యంలో అండర్–15విభాగంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కీడలతో చిన్నారుల శారీరక ధృడత్వం సైతం పెపొందుతుందన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన టీమ్–ఏ, రన్నర్స్‌గా నిలిచిన టీమ్–బీ చిన్నారులకు మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో వంశీ, గార్లపాటి శ్రీధర్, శివ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే విక్రయాలు


ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన పండ్ల దుకాణం

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలో 4 రోడ్ల కూడలి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇందులో భాగంగా చిరు వ్యాపారస్తులు రోడ్లపైనే తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఏమైన ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే పోలీసులు, ఇతర గ్రామపంచాయతీ అధికారులు హడావుడి చేస్తూ ఉంటారు. కాని ఆ ప్రమాదాల నివారణకు చర్యలు మాత్రం తీసుకోరు. పలుమార్లు పలు వ్యక్తులు గ్రామపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి ఉండడం వల్లనే తాము ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నామని సిబ్బంది అంటున్నారు. ఒక వేళ ప్రమాదాలే జరిగితే మరి ఎవరిది బాధ్యత అని విషయం కూడా అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.